బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాలి : జయరాములు

మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జయరాములు

మోత్కూరు, మార్చి 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో చేతి వృత్తిదారుల సంక్షేమానికి రూ.25వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని సంఘం సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొలగాని జయరాములు కోరారు. పట్టణంలోని విశ్రాంతి భవన్‌లో ఆదివారం చేతి వృత్తిదారులతో సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం అమలు కాని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు మద్దెపురం రాజు, పొతరబోయిన సత్యనారాయణ, వెంకటేశం, బత్తిని భిక్షం, రాచకొండ రాములమ్మ, గుండు లక్ష్మి, మెతుకు అంజయ్య, కుర్మేటి యాదయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

ఆలేరు టౌన్, మార్చి 23 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కొలనుపాక గ్రామంలోని సర్వేనంబర్-8లో ప్రభుత్వ భూమి రెండెకరాలు ఖాళీగా ఉందని, కొల్లూరు గ్రామంలో లావణ్య భూములకు పట్టాలు ఇవ్వాలని, లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెక్క వెంకటేశ్, చౌడబోయిన కనకయ్య, పరుశరాములు, రవి, ప్రవీణ్, ఆంజనేయులు, స్వామి, సరళ, ఓదయ్య, భవాని, సంపత్, బుచ్చి, యాదమ్మ, మల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

రజకుల సంక్షేమం కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి : వెంకటేశ్

సభ్యత్వం అందిస్తున్న రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

ఆత్మకూరు(ఎం), మార్చి 23 : రజకుల సంక్షేమం కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్డేబోయిన వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు పల్లెర్ల గ్రామంలో వృత్తిదారుల సంఘం సభ్యత్వాలను ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా రజక వృత్తిదారుల సంక్షేమం కోసం ఇచ్చిన వాగ్దానరాలను నెరవేర్చాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాండ్రీ షాప్‌లకు ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను కొనసాగించి, బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ సలహాదారులు ఎలిమినేటి నగేశ్, ఆత్మకూరు(ఎం) రజకసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎలిమినేటి మురళికృష్ణ, పైళ్ల ప్రశాంత్, వెలిమేకన్న సత్యనారాయణ, వెంకటేశ్, ఉప్పలయ్య, ప్రశాంత్, శ్రీను, రాములు, సురేశ్, పవన్ పాల్గొన్నారు.

షామీర్‌పేట చెరువును రిజర్వాయర్‌గా మార్చాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరిపాండు

బొమ్మలరామారం, మార్చి 23 : మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలోని షామీర్‌పేట చెరువును రిజర్వాయర్‌గా మార్చి బొమ్మలరామారం మండలానికి సాగు, తాగు నీరు అందించాలని సీసీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరిపాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం అధ్వర్యంలో మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం అఖిల పక్షం పార్టీ నాయకులతో షామీర్‌పేట చెరువు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ చెరవు నీటి సామార్థ్యాన్ని 0.6 టీఎంసీ నుంచి 5 టీఎంసీలకు పెంచితే బొమ్మలరామారం, భువనగిరి, బీబీనగర్ మండలాలకు సాగు, తాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్, గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వైళ్ల శ్రీనివాస్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండలాధ్యక్షుడు సుర్వి వెంకటేశ్ గౌడ్, అన్నమైన వెంకటేశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల హామీ అమలు చేయాలి : ఇమ్రాన్

వంట కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్

భువనగిరి అర్బన్, మార్చి 23 : మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం రేవంత్ ఎనికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని వంట కార్మికులతో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిమాండ్ల సాధనకై ఈ నెల 26వ ఇందిరా పార్క్ వద్ద జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నాకు యాదాద్రి జిల్లా వ్యాప్తంగా వంట కార్మికులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్ బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, నాయకులు నిర్మల, సంధ్య, మమత, రమ, వరలక్ష్మి, రత్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | పోచంపల్లి: 9182777638

పల్లెల్లో పచ్చదనం కనుమరుగు

● నిరాదరణకు గురవుతున్న పల్లె ప్రకృతి వనం ● నిరుపయోగంగా డంపింగ్‌యార్డ్‌లు

అడవిదేవులపల్లి, మాడ్గులపల్లిలోని పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

మిర్యాలగూడ, మార్చి 23 : గత ప్రభుత్వం పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో హరితం కనుమరుగవుతున్నది. వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోక పోవడంతో వనంలోని చెట్లన్నీ ఎండిపోతున్నాయి. దాంతో పాటు చెత్తను సేకరించి ఒక చోట వేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా రోడ్ల వెంట, వీధుల్లోనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

ఎండిపోతున్న మొక్కలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు కనుమరగయ్యే పరిస్థితి దాపురించింది. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 135 గ్రామపంచాయతీల పరిధిలో గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేసింది. అందులో రకరకాల పూలు, పండ్ల మొక్కలను నాటారు. నీటి వసతి కోసం బోరును, చుట్టూ కంచెను సైతం ఏర్పాటు చేశారు. వనంలోని మొక్కలకు నిత్యం నీరు పోయడంతో పాటు వాటిని సంరక్షించేందుకు వన రక్షకులను సైతం నియమించారు. దాంతో మొక్కలు పెరిగి పచ్చదనం సంతరించుకున్నాయి. పూల మొక్కలు పెరిగి ఆహ్లాదాన్ని పంచాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు పచ్చదనంతో వెల్లివిసిరిన పల్లె ప్రకృతివనాలు ప్రస్తుతం కళావిహీనంగా మారాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోక పోవడంతో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. అందులో ఉన్న మొక్కలు, చెట్లకు నీరు పోసే దిక్కు లేక పోవడంతో ఎండిపోయాయి. ఒకప్పుడు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచిన పల్లె ప్రకృతి వనాలు నేడు ఎండిన చెట్లతో కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. అయినా పట్టించుకునే వారే లేకుండా పోయారు.

పారిశుధ్యం అంతంతే..

గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ఇచ్చింది. ప్రతి రోజూ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి దానిని డంపింగ్ యార్డుకు తరలించే ఏర్పాటు చేశారు. దాంతో గ్రామాలన్నీ పరిశుభ్రంగా దర్శనమిచ్చేవి. కానీ ప్రస్తుతం డంపింగ్ యార్డులను పట్టించుకోక పోవడంతో పాటు చెత్త సేకరణ కూడా మర్చిపోయారు. అరకొరగా సేకరించినా రోడ్డు పక్కనో, గ్రామ శివారులోనే పడేసి వెళ్తున్నారు. ఫలితంగా రోడ్ల వెంట మొత్తం చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి.

పట్టణ పేదలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి : సత్తయ్య

నల్లగొండ, మార్చి 23: పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి పేదలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలని పట్టణ పేదల సంఘం కన్వీనర్ దండంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని 11, 44 వార్డుల్లో పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ పేదల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దండంపల్లి సరోజ, ఊట్కూరి మధుసూదన్‌రెడ్డి, సీతా వెంకటయ్య, ఫాతిమా, కృష్ణ, సైదమ్మ, సుల్తాన్, సరస్వతి, పుష్పలత పాల్గొన్నారు.

మదనాపురం-నల్లగొండ రోడ్డులో రాకపోకలు నిలిపివేత

నల్లగొండ సిటీ, మార్చి 23: కనగల్ మండలం జీ.యడవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మదనాపురం నుంచి దోరేపల్లి మీదుగా నల్లగొండకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నందున ఈ నెల 24 నుంచి 30 వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోడ్డులో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. రోడ్డు నిర్మాణానికి వాహనదారులు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాలిగౌరారం, మార్చి 23 : మండలంలోని తిరుమలరాయినిగూడెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం గ్రామ ప్రత్యేకాధికారి రాములు ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నాటి కృష్ణ, బొల్లికొండ గణేశ్, పెండెల వినయ్, మల్లేశ్, వడ్లకొండ సైదులు, వాడపల్లి మల్లేశ్, వెంకన్న పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికుల మునుగోడు మండల మహాసభ

మునుగోడు, మార్చి 23 : భవన నిర్మాణ కార్మిక సంఘం 11వ మండల మహాసభను సోమవారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు చాపల శ్రీను హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని భవన నిర్మాణ కార్మికులు హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

అడవిదేవులపల్లి, మార్చి 23: మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మువ్వా రామారావు గ్రామస్తులకు ఉచితంగా గుండె, గ్యాస్ట్రో, యురాలజీ, ఆర్థో పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో వైద్యులు మువ్వా శ్రీహర్ష, ఆదిల్‌బాషా, ఎం.వెంకటేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ఆవులు మృతి

దేవరకొండరూరల్, మార్చి 23 : మండలంలోని కాచారం గ్రామంలో శనివారం రాత్రి పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. రాత్రి ఈదురు గాలులు, ఉరుములతో తేలికపాటి వర్షం కురిసింది. గ్రామానికి చెందిన అబ్బనోని నాగయ్య రెండు ఆవులను పొలం వద్ద ఉన్న చెట్టుకు కట్టేసి ఉంచగా చెట్టుపై పిడుగు పడింది. దాంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఆవులు మృతి చెందడంతో తన జీవనాధారం పోయిందని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

మిర్యాలగూడ వాసికి ఉగాది పురస్కారం

పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

మిర్యాలగూడటౌన్, మార్చి 23: పట్టణానికి చెందిన వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం విజయవాడ గోల్డెన్ వేలో విశ్వజ్యోతి విజ్ఞానసంస్థ నిర్వహించిన సనాతన ధర్మం, వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో సత్యనారాయణకు ఉగాది పురస్కారం అందించి సత్కరించారు. పురస్కారం అందుకున్న సత్యనారాయణను స్థానికులు అభినందించారు.

వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తులు

మునుగోడు, మార్చి 23 : వ్యవసాయ యాంత్రీకరణ ఉప ప్రణాళిక పథకం కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తు ఫారం వెంట పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌లు (ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు మాత్రమే), పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఈ నెల 26లోపు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందించాలని కోరారు. పట్టాదారు పాసు బుక్ మహిళా రైతుల పేరు మీదనే ఉన్నవారే అర్హులని తెలిపారు. ఎంపిక చేసిన రైతులు రాయితీ పోను మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ

పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మునీర్

మిర్యాలగూడటౌన్, మార్చి 23: పట్టణానికి చెందిన 120 మంది నిరుపేద ముస్లింలకు జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్‌కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్ద ముఫ్తి ఇమ్రాన్, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్, కార్యదర్శి తాజ్‌బాబా, జరీనా, కొమరోజు యాదగిరి, అమీర్‌అలీ, షాహిర్, రఫీ, సీతారాం, సందీప్, ఫహీం, రషీద్, రుబీనా పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మండల కార్యవర్గం ఎన్నిక

మండల అధ్యక్షుడు బిల్లకంటి శ్రీకాంత్

పట్టణ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్

నార్కట్‌పల్లి, మార్చి 23 : ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తెరేటుపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కాచం సత్యనారాయణ, వనమా మనోహర్, రాములు పర్యవేక్షణలో కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా బిల్లకంటి శ్రీకాంత్, గౌరవాధ్యక్షుడిగా ఇడుకుల భిక్షమయ్య, పట్టణ అధ్యక్షుడిగా పసునూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. యువజన విభాగం మండలాధ్యక్షుడిగా ఇడుకుల సంపత్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కర్నాటి రమాదేవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు పాల్వాయి భాస్కర్‌రావు, నాయకులు ప్రసాద్, వాసుదేవ్, దేవరశెట్టి నారాయణ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నల్లగొండ సిటీ, మార్చి 23 : జిల్లా కేంద్రంలోని లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న రూప లాడ్జిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (35) విజయవాడ అడ్రస్‌తో గది తీసుకున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటల వరకు కూడా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది కిటికీలోంచి చూడగా మృతి చెంది ఉన్నాడు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. లాడ్జి యాజమాన్యం అతడి పూర్తి అడ్రస్, ఆధార్‌కార్డు లేకుండానే గదిని కేటాయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే జిల్లా కేంద్రంలో ఉన్న లాడ్జీపై పోలీసులు దృష్టి సారించక పోవడం వల్లే వాటి యాజమాన్యాలు కనీస నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యువకుడి అదృశ్యం

మిర్యాలగూడ రూరల్, మార్చి 23 : మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన బానోతు రాజేశ్ (21) కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 15 తేదీన తన అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో రాజేశ్‌తండ్రి శ్రీనివాస్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాజేశ్ ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో, సెల్ 8712670179 కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

నిశ్శబ్ద ఘోష పుస్తకావిష్కరణ

రామగిరి, మార్చి 23 : నల్లగొండకు చెందిన ప్రముఖ కవి చకిలం కొండల నాగేశ్వరరావు రచించిన నిశ్శబ్ద ఘోష, డాక్టర్ చకిలం ఫణికుమార్ రచించిన మనిషే చెట్టైతే కవితా సంపుటిని ఆదివారం స్థానిక చిన వెంకట్‌రెడ్డి మినీ ఫంక్షన్‌హాల్లో ఆవిష్కరించారు. సాహితీ మేఖల, ఉనికి సామాజిక సాంస్కృతిక వేదక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు యూనివర్శిటీ మాజీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలు రు గౌరీశంకర్ పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు.

వెంకటనారాయణ కుటుంబానికి చిరుమర్తి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మార్చి 23 : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దోసపాటి వెంకటనారాయణ ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామానికి వెళ్లి వెంకటనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మాజీ ఎంపీటీసీ ఇమడపాక వెంకన్న, కౌన్సిలర్ పల్లె విజయ్ ఉన్నారు.

పూర్తిగా ఎండిపోయిన కుర్రారం చెరువు

చుక్కనీరు లేని కుర్రారం చెరువు

రాజాపేట, మార్చి 23 : మండలంలోని కుర్రారం ఊర చెరువు కింద 227 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్నది. ఈ చెరువు నిండితే కింద ఉన్న ఆయకట్టుతో పాటు బూరుగుపల్లి, పారుపల్లి, నమిలే, దూది వెంకటాపురం గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి సాగునీరు అంది పొలాలు పండేవి. అలాంటి చెరువు నేడు చుక్క నీరు లేక ఎడారిగా మారడంతో భూగర్భ జలాల అడుగంటి బోర్లు, బావులు వట్టిపోయి ఆయకట్టు కింద సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ఎండిపోవడంతో రైతులు చేసేది లేక పశువులకు జీవాలకు వదిలేస్తున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం నాయకులు

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు తరలిరావాలి : రమేశ్

బీబీనగర్, మార్చి 23 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు కురుమ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని విగ్రహ కమిటీ చైర్మన్ సోము రమేశ్ కురుమ కోరారు.

మండల కేంద్రంలో కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 3న కొమురయ్య 98వ జయంతి సందర్భంగా బీబీనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో జాన సత్యనారాయణ కురుమ, సోమ ముత్యాలు, ఉపాధ్యక్షుడు మంగ అశోక్ కుమార్, గూడి శ్రీశైలం కురుమ, భువనగిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చీర ఐలయ్య కురుమ, గుండెబోయిన అయోధ్య యాదవ్, ఎర్రం సత్యనారాయణ పాల్గొన్నారు.

గౌడ సంఘ భవనం నిర్మించాలి : లక్ష్మీనారాయణగౌడ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న అతికం లక్ష్మీనారాయణగౌడ్

భువనగిరి అర్బన్, మార్చి 23. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గౌడ సంఘ భవనం నిర్మించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అతికం లక్ష్మీనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. భువనగిరిలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రమేశ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చిగురుపల్లి సోమయ్య గౌడ్, రవి కుమార్ గౌడ్, కట్కూరి నరేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ నాగెల్లి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

మహేశ్వరి పద్య కావ్యం పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 23 : మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ పాండాల మహేశ్వర్ రూపొందించిన మహేశ్వరి పద్య కావ్యం పుస్తకాన్ని భారత జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ పెసర